RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

# హైదరాబాద్ ఎస్టేట్

తెలుగు దిన పత్రిక

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

hyderabadestate.co.in




సంపుటి -13 సంచిక - 422 | 14 మంగళవారం జూలై 2026 | ఎడిటర్: బట్టు లక్ష్మీ నారాయణ | పేజీలు - 6 వెల రూ 5 /--

# కేంద్రమే దిక్కు

## - రాష్ట్రాభివృద్ధికి కేంద్ర సాయం అత్యవసరం
## - ఎంపీల సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి

రాష్ట్రాభివృద్ధికి కేంద్ర సహకారం అత్యవసరమని, తెలంగాణకు సంబంధించిన పెండింగ్ ప్రాజెక్టులు, జాతీయ సంస్థలు, మౌలిక వసతుల పనులకు అవసరమైన అనుమతులు, నిధుల సాధనలో అన్ని పార్టీల ఎంపీలు సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరారు. పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో సోమవారం మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో జరిగిన తెలంగాణ ఎంపీల సమావేశంలో ఆయన ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో కేంద్ర మంత్రులు, ప్రధానమంత్రిని కలిసి తెలంగాణ అవసరాలను బలంగా వినిపించాలని సూచించారు. హైదరాబాద్‌లో ఐఐఎం ఏర్పాటు, మెట్రో రెండో దశ విస్తరణ, రీజినల్ రింగ్ రోడ్డు, మూసీ పునరుజ్జీవం, తమ్మిడిహట్టి ప్రాజెక్టు, తుంగభద్ర జలాల సమస్య, గోదావరి–కావేరి అనుసంధానం, వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాలు, బుల్లెట్ రైలు వంటి కీలక అంశాలపై కేంద్ర అనుమతులు, నిర్ణయాలు అవసరమని సీఎం వివరించారు. ఆయా శాఖల కేంద్ర మంత్రులను కలిసి పెండింగ్ ప్రతిపాదనలకు ఆమోదం తీసుకొచ్చేలా కృషి చేయాలని కోరారు. ఎంపీలకు అవసరమైన సమాచారం, అధికారిక పత్రాలు, తాజా వివరాలను అందించేందుకు ఢిల్లీలోపి తెలంగాణ భవన్‌లో ప్రత్యేక సమన్వయ వ్యవస్థను ఏర్పాటు చేసినట్టు తెలిపారు.


**భేషజాల్లేవు : భట్టి**

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార మాట్లాడుతూ రాష్ట్ర ప్రయోజనాల విషయంలో ప్రభుత్వానికి ఎలాంటి రాజకీయ భేషజాలు లేవని స్పష్టంచేశారు. సమాఖ్య స్ఫూర్తితో కేంద్రంతో కలిసి పనిచేస్తూ తెలంగాణకు రావాల్సిన నిధులు, సంస్థలు, ప్రాజెక్టులను సాధించడమే లక్ష్యమని చెప్పారు. పార్లమెంట్ ప్రశ్నోత్తరాల సమయం, జీరో అవర్, స్టాండింగ్ కమిటీలు, కన్సల్టేటివ్ కమిటీలను సమర్థంగా వినియోగించి రాష్ట్ర సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని ఎంపీలకు సూచించారు. అవసరమైతే ముఖ్యమంత్రి, తాను ఢిల్లీకి వెళ్లి ఎంపీలతో కేంద్ర మంత్రులను కలుస్తామని చెప్పారు. సమావేశంలో ఎంపీలు కూడా పలు సూచనలు చేశారు. ధాన్యం నిల్వ సామర్థ్యం, సింగరేణికి బొగ్గు బ్లాకుల కేటాయింపు, సాగునీటి ప్రాజెక్టులు, ప్రొటోకాల్, కేంద్ర అనుమతుల వంటి అంశాలను ప్రస్తావించారు.



ఎంపీలు కోరిన ప్రతి సమాచారాన్ని వేగంగా అందించాలని సీఎం, ఉప ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

## పోలవరం, బనకచర్లపై పిటిషన్..
### తెలంగాణకు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ




అంతర్రాష్ట్ర జల వివాదాలకు సంబంధించిన అంశాల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. పోలవరం ప్రాజెక్టు, కృష్ణా నదీ జలాల వినియోగం, బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్ అంశాలపై దాఖలైన పిటిషన్‌ను జస్టిస్ విక్రమ్‌నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారించింది. ఈ కేసులో మొత్తం 15 మంది ప్రతివాదులు ఉన్నారని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న పనులపై తక్షణమే స్టే విధిస్తూ నోటీసులు జారీ చేయాలని కోర్టును తెలంగాణ తరఫు న్యాయవాది కోరారు. అయితే, తెలంగాణ దాఖలు చేసిన పిటిషన్‌లో తీవ్ర సాంకేతిక లోపాలు ఉన్నాయని ధర్మాసనం గుర్తించింది. వాటిని సరిచేసే వరకు విచారణ చేపట్టలేమని స్పష్టం చేసింది. ప్రాథమిక లోపాలు సరిదిద్దకముందే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేయడం గానీ, మధ్యంతర ఉత్తర్వులు (ఇంజెక్షన్/స్టే) ఇవ్వడం గానీ సాధ్యం కాదని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. ముందుగా పిటిషన్‌లోని లోపాలను సవరించాలని తెలంగాణ ప్రభుత్వానికి సూచించింది. ఆ తర్వాతే మిగిలిన అంశాలపై విచారణ చేపడతామని పేర్కొంది. అనంతరం కేసు విచారణను వాయిదా వేసింది.

## ‘సింగరేణి భరోసా యాత్ర’ ప్రారంభించిన తెలంగాణ బీజేపీ



సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్)కు కేంద్ర ప్రభుత్వం తాడిచెర్ల–2 బొగ్గు బ్లాక్ కేటాయించిన నిర్ణయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు తెలంగాణ బీజేపీ సోమవారం ‘సింగరేణి భరోసా యాత్ర’ను ప్రారంభించింది. హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయం నుంచి కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు తదితర నేతలు ఈ రెండు రోజుల యాత్రకు శ్రీకారం చుట్టారు. అనంతరం ఖమ్మం జిల్లాకు చేరుకున్న వారికి పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. ఈ యాత్రలో భాగంగా నాలుగు జిల్లాల్లోని సింగరేణి గనుల కార్మికులను కలిసి, సంస్థ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలను వివరించనున్నట్లు బీజేపీ నేతలు తెలిపారు. తాడిచెర్ల–2 బొగ్గు బ్లాక్ కేటాయింపు వల్ల సింగరేణి దీర్ఘకాలిక ఆర్థిక వృద్ధికి బలం చేకూరుతుందని, దీంతో కార్మికుల్లో విశ్వాసం పెరిగిందని రాంచందర్ రావు పేర్కొన్నారు. యాత్ర ప్రారంభానికి ముందు మాట్లాడిన రాంచందర్ రావు, గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రెండూ సింగరేణిని నిర్లక్ష్యం చేశాయని ఆరోపించారు. ఈ కారణంగానే ప్రభుత్వ రంగ సంస్థ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోందని అన్నారు. మరోవైపు ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం మాత్రం సింగరేణిని బలోపేతం చేయడానికి కృషి చేస్తోందని పేర్కొన్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ తాడిచెర్ల–2 బొగ్గు బ్లాక్‌ను సింగరేణికి కేటాయించడం చరిత్రాత్మక నిర్ణయమని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం బొగ్గు బ్లాక్‌లు వేలం ద్వారా కేటాయించాల్సి ఉన్నప్పటికీ, చట్టపరమైన అవకాశాలను పరిశీలించి, న్యాయ సలహా తీసుకున్న అనంతరం మోదీ ప్రత్యేకంగా ఈ బ్లాక్‌ను సింగరేణికి కేటాయించే నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. ట్రేడ్ యూనియన్ల విజ్ఞప్తి మేరకు తాను ప్రధానితో చర్చించి ఈ కేటాయింపును సాధించామని చెప్పారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి
### : ట్రాఫిక్ డీసీపీ



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జులై 13:–
మహేశ్వరం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను ఫ్యూచర్ సిటీ ట్రాఫిక్ డీసీపీ శివం ఉపాధ్యాయ, ఐపీఎస్ సోమవారం తనిఖీ చేసి సిబ్బందికి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రజల ప్రాణ భద్రతే లక్ష్యంగా ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగాన్ని తప్పనిసరి చేస్తూ ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకోవాలని, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను నిరంతరం నిర్వహించాలని ఆదేశించారు. పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాలు, ఇతర ప్రజా ప్రదేశాల్లో ట్రాఫిక్ అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని సూచించారు. పెండింగ్ ట్రాఫిక్ చలాన్ల వసూళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు.
వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నీరు నిలిచే ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన ట్రాఫిక్ నియంత్రణ చర్యలు తీసుకోవాలని, అలాంటి ప్రాంతాల సమాచారాన్ని వెంటనే జీహెచ్‌ఎంసీ అధికారులకు చేరవేయాలని ఆదేశించారు. విధుల నిర్వహణలో ట్రాఫిక్ పరికరాలతో పాటు రెయిన్‌కోట్ తప్పనిసరిగా వెంట ఉంచుకోవాలని సూచించారు. ఈ తనిఖీలో మహేశ్వరం ట్రాఫిక్ ఏసీపీ ఎ. చంద్రశేఖర్, ఎస్‌హెచ్‌ఓ జి. వెంకటేశ్వర్ రావు తదితర ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.



## ఇక హర్మూజ్ జలసంధిని మేమే నడిపిస్తాం..
## కానీ మాకు డబ్బులివ్వాలి : ట్రంప్

అంతర్జాతీయ రాజకీయాల్లో తీవ్ర పరిణామాలకు దారితీసే విధంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. కీలకమైన హర్మూజ్ జలసంధిని అమెరికా తన నియంత్రణలోకి తీసుకుంటుందని, ఇకపై దాని భద్రతను శాశ్వతంగా పర్యవేక్షిస్తుందని సోమవారం స్పష్టం చేశారు. ఇరాన్ ఒక సైనిక ఒప్పందాన్ని ఉల్లంఘించి, ఈ వ్యూహాత్మక జలమార్గంలోకి డ్రోన్లను పంపడమే ఇందుకు కారణమని ఆయన ఆరోపించారు.
ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ, “మేం హర్మూజ్ జలసంధిని స్వాధీనం చేసుకుంటున్నాం. ఇక వాళ్ల దగ్గర ఏమీ లేదు“ అని వ్యాఖ్యానించారు. ఇరాన్‌కు చెందిన సైనిక ఆస్తులే లక్ష్యంగా నిన్న రాత్రి అమెరికా దాడులు చేసిందని, డ్రోన్ల కార్యకలాపాలు కొనసాగితే ఇలాంటి దాడులు మరిన్ని ఉంటాయని ఆయన తీవ్రంగా హెచ్చరించారు. “నిన్న రాత్రి వారిపై తీవ్రంగా దాడులు చేశాం. వాళ్లు డ్రోన్ పంపిన ప్రతిసారీ మేం గట్టిగా బదులిస్తాం. వారి యాంటీ–ఎయిర్‌క్రాఫ్ట్ గన్‌తో సహా చాలా పరికరాలు ధ్వంసమయ్యాయి“ అని ట్రంప్ తెలిపారు. ఇరాన్‌తో సుదీర్ఘ చర్చల అనంతరం ఒక ఒప్పందం కుదిరిందని, అయితే చివరి నిమిషంలో ఇరాన్ ప్రతినిధులు మార్పులు కోరడంతో అది విఫలమైందని ట్రంప్ వెల్లడించారు. “మా మధ్య ఒక డీల్ కుదిరింది. 11 గంటల సమావేశం తర్వాత వాళ్లు అన్నింటికీ ఒప్పుకున్నారు. కానీ తర్వాత ఫోన్ చేసి మార్పులు కోరారు. అందుకే మేం ఆ ఒప్పందాన్ని పక్కనపెట్టాం“ అని వివరించారు. ఇకపై హర్మూజ్ జలసంధి భద్రత బాధ్యతను అమెరికానే తీసుకుంటుందని, అవసరమైతే తామే దాన్ని నడిపిస్తామని ట్రంప్ పేర్కొన్నారు. “ఈ జలసంధికి మేం సంరక్షకులుగా మారతాం“ అని ఆయన వ్యాఖ్యానించారు. అయితే, ఈ భద్రతను ఉచితంగా అందించబోమని, ఈ మార్గం ద్వారా లబ్ధి పొందుతున్న సంపన్న దేశాలు అమెరికాకు అందుకు అయ్యే ఖర్చును చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. “మా సైనికులను ప్రమాదంలోకి నెట్టి భద్రత కల్పిస్తున్నందుకు మాకు డబ్బు చెల్లించాలి“ అని ట్రంప్ స్పష్టం చేశారు. పర్షియన్ గల్ఫ్‌ను అరేబియా సముద్రంతో కలిపే హర్మూజ్ జలసంధి, ప్రపంచ ఇంధన రవాణాలో అత్యంత కీలకమైనది. గల్ఫ్ దేశాల నుంచి భారత్ సహా ఇతర ఆసియా దేశాలకు చమురు, గ్యాస్ ఎగుమతులు ఈ మార్గం గుండానే జరుగుతాయి.

# మేడిగడ్డపై చర్చకు సిద్ధమా?
## : మంత్రి ఉత్తమ్‌కు జగదీశ్ రెడ్డి సవాల్



తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి జగదీష్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రాష్ట్రానికి బీజేపీ ఏ విధంగా అన్యాయం చేస్తోందో, కాంగ్రెస్ సైతం అదే బాటలో పయనిస్తోందని ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వాన్ని ఆయన ‘హైబ్రిడ్ కాంగ్రెస్‘గా అభివర్ణించారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో వ్యవసాయ, నీటిపారుదల రంగాలు పూర్తిగా నిర్వీర్యమయ్యాయని జగదీష్ రెడ్డి ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా రైతులకు సాగునీరు అందించి, రాష్ట్రాన్ని ధాన్య ఉత్పత్తిలో అగ్రగామిగా నిలిపారని గుర్తుచేశారు. కానీ, నేడు రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. మేడిగడ్డ బ్యారేజీ మరమ్మతులపై సూచనలు చేసిన రిటైర్డ్ ఇంజనీర్లను జైల్లో పెడతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బెదిరించడం అప్రజాస్వామికమని మండిపడ్డారు. నీటి నిల్వలపై అవగాహన లేకుండా వ్యవహరిస్తే భద్రాచలం వంటి ప్రాంతాలకు వరద ముప్పు తప్పదని హెచ్చరించారు. ఈ అంశంపై నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చర్చకు సిద్ధంగా ఉన్నారా? అని జగదీష్ రెడ్డి సవాల్ విసిరారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో నేరాలు 50 శాతం పెరిగాయని, ప్రభుత్వ వైఫల్యాలపై అసెంబ్లీలో చర్చించే ధైర్యం అధికార పార్టీకి లేదని విమర్శించారు. ఇంజనీర్లపై ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యల పట్ల డీజీపీ తగిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
14 మంగళవారం జూలై 2026

## పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేసిన ప్రభుత్వ విప్ విజయరమణ రావు .







హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి పెద్దపల్లి ఎలిగేడు మండలం శివపల్లి గ్రామంలో 10 లక్షల రూపాయల నిధులతో పలు సీసీ రోడ్ల నూతన నిర్మాణం కోసం స్థానిక నాయకులతో కలిసి శంకుస్థాపన చేసిన గౌరవ ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు శ్రీ. చింతకుంట విజయరమణ రావు గారు..ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దుగ్యాలవాణి గోపాల్ రావు మరియు మండల పార్టీ అధ్యక్షులు రాజేశ్వర్ రెడ్డి, దుగ్యాల సంతోష్ రావు మరియు పాలకవర్గం మరియు ప్రజాప్రతినిధులు మరియు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

## : మంత్రి జూపల్లి కృష్ణారావు



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఇరిగి రఅశోక్
ఆసిఫాబాద్, జూలై 11:రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి, మహిళా సాధికారత, గిరిజన సంక్షేమం, పేదల గృహ నిర్మాణం వంటి అన్ని రంగాలకు సమాన ప్రాధాన్యతనిస్తూ జిల్లాల సమగ్ర అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తుందని రాష్ట్ర ఆబ్కారీ మద్యనిషేధ, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు గారు అన్నారు. శనివారం జిల్లాలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను జిల్లా కలెక్టర్ కె.హరిత, జిల్లా ఎస్.పి. నితికా పంత్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, శాసనమండలి సభ్యులు దండే విఠల్, ఆసిఫాబాద్ శాసనసభ్యులు కోవ లక్ష్మి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరుకుల్ల మంగ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ జిల్లా సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఆసిఫాబాద్ మండలం మానిక్‌గూడ, వాంకిడి మండలం కోమటిగూడ గ్రామాలలో 20 లక్షల రూపాయల చొప్పున నిర్మించిన గ్రామపంచాయతీ భవనాలను ప్రారంభించడం జరిగిందని, ఈ భవనాల ద్వారా గ్రామస్థాయిలో ప్రజలకు మెరుగైన పరిపాలనా సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. గ్రామపంచాయతీలు గ్రామాల అభివృద్ధికి కేంద్రబిందువులుగా మారాలని, ప్రజలకు అవసరమైన సేవలు పారదర్శకంగా అందించాలని అధికారులను ఆదేశించారు. కెరమెరి మండలం ధనోరా గ్రామంలో 10 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన మహిళా సమాఖ్య సంఘ భవనాన్ని ప్రారంభించడం జరిగిందని, మహిళా సంఘాలు ఆర్థికంగా మరింత బలోపేతం కావడానికి ప్రభుత్వం అనేక సంక్షేమ, స్వయం ఉపాధి కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. మహిళలు సంఘటితంగా ముందుకు సాగి స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకొని కుటుంబాలతో పాటు సమాజాభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని తెలిపారు. ఆసిఫాబాద్ మండలం అడ గ్రామంలో నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించి నిరుపేద కుటుంబానికి సొంత ఇంటి కలను నెరవేర్చడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి గౌరవప్రదమైన నివాసం కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.

కెరమెరి మండలం సుర్దాపూర్ గ్రామానికి చెందిన పోడు రైతులు తాతముత్తాతల కాలం నుంచి తాము సాగు చేసుకుంటున్న భూములను అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని, సాగు భూములలోకి వెళ్లకుండా పోలీసుల ద్వారా ఇబ్బందులు ఎదురవుతున్నాయని రాష్ట్ర మంత్రి దృష్టికి తీసుకురాగా స్పందిస్తూ 2005 సంవత్సరానికి ముందు నుంచి సాగు చేస్తున్న పాత పోడు భూముల విషయంలో రైతులను ఎట్టి పరిస్థితులలోనూ ఇబ్బందులకు గురిచేయవద్దని అధికారులకు సూచించారు. అదే సమయంలో కొత్తగా అటవీ భూములను ఆక్రమిస్తూ పోడు సాగు చేయకూడదని, పోడు భూములకు సంబంధించిన అంశం కేంద్ర ప్రభుత్వ పరిధిలోని చట్టాలకు సంబంధించినదని, గిరిజనేతర రైతుల సంబంధిత సమస్యలపై అధికారులతో చర్చించి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సుర్దాపూర్ గ్రామ రైతుల భూ సమస్యపై జిల్లా అధికారులు, అటవీశాఖ అధికారులతో ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించి, చట్టపరమైన సాధ్యాసాధ్యాలను పరిశీలించి సాగుకు అనుకూలమైన పరిష్కారం చూపేందుకు కృషి చేస్తామని తెలిపారు. భూములు, ఆస్తులు శాశ్వతం కావని, పిల్లలే మనకు నిజమైన ఆస్తిఅని, వారిని బాగా చదివించి ఉన్నత స్థానాలలో నిలబెట్టడం ప్రతి తల్లిదండ్రుల బాధ్యత అని తెలిపారు. విద్య ద్వారానే కుటుంబాలు, గ్రామాలు, సమాజం అభివృద్ధి చెందుతాయని తెలిపారు.బి
జిల్లా అభివృద్ధి, ప్రజల సంక్షేమం, గ్రామీణ మౌలిక సదుపాయాల కల్పన, మహిళల సాధికారత, రైతుల సమస్యల పరిష్కారం వంటి అంశాలలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, ప్రజల సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.
ఈ కార్యక్రమాల్లో జిల్లా స్థాయి అధికారులు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు, మహిళా సంఘాల సభ్యులు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# సింగరేణి కష్టాలకు బీఆర్ఎస్ కాంగ్రెస్సే కారణం

## – తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్ తో సింగరేణికి మనుగడ
## – కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి





భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి,జూలై13(హైదరాబాద్ ఎస్టేట్):
సిరుల గని సింగరేణిని గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కష్టాలు పాలు చేసిందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి భరోసా యాత్ర కార్యక్రమంలో భాగంగా బిజెపి ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కొత్తగూడెం క్లబ్లో ఏర్పాటు చేసిన సభకి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఒకప్పుడు సింగరేణిలో ఎక్కువ సంఖ్యలో ఉన్న కార్మికులు క్రమక్రమంగా తగ్గిపోతున్నారని అంతేకాకుండా బొగ్గు ఉత్పత్తి సైతం క్రమంగా తగ్గుతుందని దీనికి కారణం రాష్ట్ర ప్రభుత్వాలేనని విమర్శించారు. ముఖ్యంగా గత కెసిఆర్ ప్రభుత్వం సింగరేణి సొమ్మును భారీగా దోచుకుందని మండిపడ్డారు. సింగరేణిని అభివృద్ధిలోకి నడిపించాల్సిన కేసీఆర్ భ్రష్టు పట్టించే విధంగా వ్యవహరించడం జరిగిందన్నారు. ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే బాటలో నడుస్తుందని అసహనం వ్యక్తం చేశారు. గత కాంగ్రెస్ హయాంలోని ప్రధానమంత్రిగా మన్మోహన్ సింగ్ ఉన్న సమయంలో పెద్ద ఎత్తున బొగ్గు కుంభకోణం జరిగిందని ఆరోపించారు. కష్టాల్లో ఉన్న సింగరేణిని గట్టెక్కించేందుకు
నరేంద్ర మోదీ ప్రభుత్వం వేలం లేకుండా తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్ ను సింగరేణికి కేటాయించడం జరిగిందన్నారు. ఈ బొగ్గు బ్లాక్ ద్వారా దాదాపు 50 ఏళ్ల పాటు నాణ్యమైన బొగ్గు దొరుకుతోందని తెలిపారు. దీంతో సింగరేణికి భారీ ఆదాయం సమకూరుతుందన్నారు.

సింగరేణికి అండగా బిజెపి...

ఎంతోమంది కార్మికులకు ఉద్యోగులకు ఉపాధి కల్పిస్తున్న సింగరేణి కాలరీస్ కంపెనీకి బిజెపి ప్రభుత్వం అండగా నిలుస్తుందని బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు అన్నారు. గత కెసిఆర్ ప్రభుత్వం సింగరేణిని ఏటీఎంగా వాడుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికుల కష్టంతో సింగరేణికి వచ్చిన సొమ్మును ఇతర పనులకు వినియోగించడం జరిగిందన్నారు. కార్మికుల సొమ్మును వారి సంక్షేమ కోసమే ఖర్చు చేయాల్సింది పోయి దుర్వినియోగం చేయడం అత్యంత బాధాకరమన్నారు. సింగరేణిలో 49 శాతం వాటా కేంద్ర ప్రభుత్వానిది ఉంటుందని 51 శాతం రాష్ట్ర ప్రభుత్వానిది ఉంటుందన్నారు. కంపెనీలో కేంద్రం వాటా ఉన్న కూడా కేంద్రం పెత్తనం ఉండదన్నారు. కేవలం రాష్ట్ర ప్రభుత్వానిదే ఉంటుందని స్పష్టం చేశారు. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వాలు సింగరేణిని అభివృద్ధిలో నడిపించడంలో విఫలం కావడం విచారకరమన్నారు. కేంద్ర బొగ్గు గనుల శాఖమంత్రి కిషన్ రెడ్డి కృషి మేరకు నరేంద్ర మోడీ ప్రభుత్వం సింగరేణికి తాడిచర్ల-2 బొగ్గు బ్లాకును కేటాయించడం జరిగిందన్నారు. ఈ బొగ్గు బ్లాకు కేటాయింపు ద్వారా నిరుద్యోగులకు ఉపాధి దొరకడమే కాకుండా నాణ్యమైన బొగ్గు లభిస్తుందని తద్వారా కంపెనీకి మంచి ఆదాయం వస్తుందన్నారు.

సింగరేణి నిధులను రెండు ప్రభుత్వాలు వాడుకున్నాయి...

సింగరేణి కార్మికులు కష్టపడి కంపెనీకి ఆదాయం చేకూరుస్తుంటే అట్టి ఆదాయాన్ని గత కెసిఆర్ ప్రభుత్వం ఇప్పుడు ఉన్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం వాడుకుంటుందని బిజెపి జాతీయ నాయకురాలు పార్లమెంటు సభ్యులు డీకే అరుణ అన్నారు. ఎంతో చరిత్ర ఉన్న సింగరేణిని నష్టాల్లోకి నెట్టే విధంగా ప్రభుత్వాలు ముందుకు పోవడం బాధాకరమన్నారు. సింగరేణి కష్టాలను గమనించిన బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి కృషితో నరేంద్ర మోడీ ప్రభుత్వం తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్ ను సింగరేణికి కేటాయించడం జరిగిందన్నారు. ఫలితంగా సింగరేణి మళ్లీ అభివృద్ధిలోకి వస్తుందని పేర్కొన్నారు. సింగరేణి సొమ్ముతో సోకులు చేసిన బీఆర్ఎస్ కాంగ్రెస్ కు రానున్న ఎన్నికల్లో ప్రజలు కార్మికులు గట్టిగా బుద్ధి చెప్పాలని డీకే అరుణ పిలుపునిచ్చారు. ఈ సభ కార్యక్రమం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బిజెపి అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# అక్రిడిటెడ్ వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు వంద శాతం ఫీజు రాయితీ అమలు చేయాలి

## – జిల్లా కలెక్టర్‌కు సామాజిక సేవకుడు కర్నే బాబురావు వినతి



భద్రాద్రి కొత్తగూడెం,జూలై13(హైదరాబాద్ ఎస్టేట్):
కరీంనగర్, మహబూబాబాద్ జిల్లాల మాదిరిగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అక్రిడిటెడ్ వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు 202627 విద్యా సంవత్సరానికి ప్రైవేట్ పాఠశాలలలో వంద శాతం ఫీజు రాయితీ అమలు చేయాలని కోరుతూ సామాజిక సేవకుడు, జర్నలిస్టుల హక్కుల పరిరక్షకుడు కర్నే బాబురావు సోమవారం జిల్లా కలెక్టర్ అంకిత్ కు వినతిపత్రం సమర్పించారు.
ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో జిల్లా విద్యాశాఖ అధికారులు అక్రిడిటెడ్ వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు 100 శాతం ఫీజు రాయితీ కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసి అమలు చేస్తున్నప్పటికీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇప్పటికీ ఆసౌకర్యం అందుబాటులోకి రాకపోవడం విచారకరమని పేర్కొన్నారు. ప్రజాసమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. పెరుగుతున్న విద్యా ఖర్చుల నేపథ్యంలో జర్నలిస్టుల కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని వారి పిల్లలకు విద్యలో సమాన అవకాశాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. జిల్లా విద్యా శాఖాధికారి (డీఈఓ)ద్వారా జిల్లాలోని అన్ని ప్రైవేట్ పాఠశాలలకు వెంటనే ఉత్తర్వులు జారీ చేసి అక్రిడిటెడ్ వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు 202627 విద్యా సంవత్సరానికి 100 శాతం ఫీజు రాయితీ అమలు చేయాలని ఆయన కోరారు. అదేవిధంగా జర్నలిస్టుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఆరోగ్య బీమా, టీఎస్ఆర్టీసీ ఉచిత లేదా రాయితీ బస్సు ప్రయాణం, రైల్వే ప్రయాణ రాయితీలు, ఇందిరమ్మ ఇల్లు తదితర ప్రభుత్వ సంక్షేమ పథకాలలో ప్రత్యేక ప్రాధాన్యం కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని ఇతర జిల్లాలలో అమల వుతున్న జర్నలిస్టుల సంక్షేమ చర్యలను భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కూడా అమలు చేయాలని ఈ విషయంపై జిల్లా యంత్రాంగం సానుకూలంగా స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని బాబురావు కోరారు.

# పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు



ముషీరాబాద్, జూలై 13: నులిపురుగులను నివారించి పిల్లల ఆరోగ్యాన్ని కాపాడుదామని ముషీరాబాద్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మనోజ్ రెడ్డి పిలుపునిచ్చారు. నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం ఆస్పత్రిలో పిల్లలకు ఆయన ఆల్బెండజోల్ మాత్రలను వేశారు.

# చదువుతో పాటు క్రీడలు అవసరం



హైదరాబాద్, జూలై 13: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.చిరంజీవి అన్నారు. కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థి అవిఘ్న వెంకట్రెడ్డి కరాటే ప్రదర్శన ద్వారా గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు అందుకున్న సందర్భంగా సోమవారం కళాశాలలో ప్రిన్సిపల్, లెక్చరర్స్ అతన్ని అభినందించి సత్కరించారు. మానసిక, శారీరక ఆరోగ్యాన్నిచ్చే ఆటలను ప్రతి ఒక్కరూ జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యంతో పాటు అంతర్జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దొరుకుతాయని అన్నారు. కార్యక్రమంలో జీవీఆర్ కరాటే అకాడమీ డైరెక్టర్ డాక్టర్ జీఎస్ గోపాల్ రెడ్డి, కళాశాల లెక్చరర్స్ రాంమోహన్, అనిల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పై 11KV లైన్ AD కి వినతి పత్రం ఇచ్చిన పండుగ పద్మావతి బాల్రాజ్



హైదరాబాద్ ఎస్టేట్ యాచారం ప్రతినిధి రామాచారి జూలై 13
రంగారెడ్డి జిల్లా యాచారం మండలం ధర్మన్నగూడ గ్రామంలో అనుమండ్ల యాదయ్య శ్రీనివాస్ కి ఇందిరమ్మ ఇండ్లు రావడంతో ఉన్న ఇంటిని కూల్చివేసి ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణంలో భాగంగా ఫిల్త్ బీములు వేయడం జరిగింది ఆ నిర్మాణ క్రమంలో ఇంటి పైనుంచి 11 కెవి లైన్ ఉండడం వలన ఇంటి నిర్మాణానికి అడ్డు రావడంతో గ్రామసభలో గ్రామ సర్పంచ్ పద్మావతి బాల్రాజ్ కి అప్లికేషన్ ఇవ్వడం జరిగింది ఇబ్రహీంపట్నం‌ాణ సార్ ని కలిసి 11 kv లైన్ తొలగించాలని ధర్మన్నగూడ సర్పంచ్ పండుగ పద్మావతి బాల్రాజ్ వినతి పత్రం AD కి ఇవ్వడం జరిగింది.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
14 మంగళవారం జూలై 2026

## కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు

### జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్ గౌడ్



హైదరాబాద్, జులై 13: రాష్ట్రంలో రేవంత్ రెడ్డి పాలన అస్త వ్యస్థంగా తయారైందని రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటమి తప్పదని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్ గౌడ్ ఆరోపించారు. సోమవారం కాచిగూడలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రం లోని రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలకు కనీస వసతులను కల్పించడంలో సీఎం పూర్తిగా విఫలమైనాడని, నరూర్ నగర్ లోని బాలికల హాస్టళ్ల దుస్తితే నిదర్శనమని ద్వజమెత్తారు. హాస్టల్లో ఉంటున్న విద్యార్థులకు మంచినీరు, మరుగుదొడ్లు, భోజన వసతులను కల్పించడంలో ప్రభుత్వం చేతులెత్తేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ మోసపూరిత విధానాలను ప్రజాక్షేత్రంలో ఎండగడుతామని, నిరుద్యోగులకు యేడాదికి 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని, దానికితోడు నిరుద్యోగ భృతి ఇస్తామని మోసం చేయడమే కాకుండా బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల శాశ్వతంగా విద్యను దూరం చేయడం కోసమే ఫీజు రియంబర్స్మెంట్ పథకానికి తూట్లు పొడుస్తూ యాజమాన్యాలకు ప్రభుత్వం కొమ్ము కాస్తుందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో పి. కృష్ణ, భూషన్ భాస్కర్, ముత్యాల్ రావు, ప్రశాంత్ నిమ్కర్, సత్యపాల్ సింగ్, ప్రదీప్ గౌడ్, పాల్గొన్నారు.

## సర్-2026 కార్యక్రమంలో భాగంగా గాంధీ కుట్టర్ బూత్ నెం.18లో హెల్ప్ డెస్క్ ఏర్పాటు



నారాయణగూడ, జూలై 13: ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (సర్-2026) కార్యక్రమంలో భాగంగా సోమవారం బూత్ నెం.18, గాంధీ కుట్టర్లో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాల స్వీకరణ, మార్గదర్శకాలు అందించబడినాయి. ఈ బూత్ పరిధిలో మొత్తం 1,215 ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేయగా, ఇప్పటివరకు 240 నింపిన ఫారాలు తిరిగి స్వీకరించబడ్డాయి. ఈ కార్యక్రమంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు. బీజేపీ తరపున కేశబోయిన శ్రీధర్, కాంగ్రెస్ తరపున జ్ఞానేశ్వర్, బీఆర్ఎస్ తరపున వంశీ పాల్గొని ప్రక్రియను పరిశీలించారు. బూత్ లెవల్ ఆఫీసర్ (బీ ఎల్ ఓ) శ్రీమతి ఐలమ్మ ఓటర్లకు అవసరమైన వివరాలు అందిస్తూ ఫారాల స్వీకరణను నిర్వహించారు.కార్యక్రమాన్ని ఈ ఆర్ ఓ శ్రీ ఎన్. శంకర్, ఏ ఈ ఆర్ ఓ శ్రీమతి పుష్పా ఠాకూర్, సూపర్వైజర్ శ్రీ ఎం. అనిల్ కుమార్, బీ ఎల్ ఓ సూపర్వైజర్ శ్రీ ఎం.డి. ఫర్హాన్ ఫరూఖీ సందర్శించి, సర్ కార్యక్రమం పురోగతిని పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు. ఓటర్లందరూ తమ ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తి చేసి నిర్ణీత గడువులోగా సమర్పించి ఓటరు జాబితా సవరణ ప్రక్రియకు సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## నామినేటెడ్ పదవులపై కాంగ్రెస్‌లో అసంతృప్తి..!

### కష్టకాలంలో పార్టీని నిలబెట్టిన కార్యకర్తలకు న్యాయం చేయాలంటూ డిమాండ్




గీసుగొండ, జులై 13 హైదరాబాద్ ఎస్టేట్: కాంగ్రెస్ పార్టీలో సొసైటీలతో పాటు వివిధ నామినేటెడ్ పదవుల కేటాయింపు వ్యవహారం క్షేత్రస్థాయిలో చర్చనీయాంశంగా మారింది. పార్టీ అధికారంలో లేని క్లిష్ట పరిస్థితుల్లో గ్రామ గ్రామాన కాంగ్రెస్ జెండాను మోస్తూ అంకితభావంతో పనిచేసిన కార్యకర్తలను విస్మరించి, ఇటీవల ఇతర పార్టీల నుంచి చేరిన వారికి ప్రాధాన్యం కల్పిస్తున్నారనే అభిప్రాయాలు పార్టీ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆరేపల్లి హవేలీ మొదటి వార్డు సభ్యుడు కమలాపురం రాజు స్పందిస్తూ, కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే నిజమైన బలమని అన్నారు. కష్టకాలంలో పార్టీని కాపాడిన కార్యకర్తల సేవలకు తగిన గుర్తింపు, గౌరవం దక్కాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పార్టీ కోసం ఏళ్ల తరబడి శ్రమించిన వారిని పక్కనపెట్టి అవకాశవాద రాజకీయాలకు ప్రాధాన్యం ఇస్తే క్షేత్రస్థాయి కార్యకర్తల్లో నిరాశ, అసంతృప్తి పెరిగే ప్రమాదం ఉందని అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా 2015కు ముందే కాంగ్రెస్ పార్టీ కోసం నిరంతరం కష్టపడిన కార్యకర్తలను గుర్తించి, సొసైటీలతో పాటు అన్ని నామినేటెడ్ పదవుల్లో వారికి సముచిత ప్రాధాన్యం కల్పించాలని ఆయన అధిష్ఠానాన్ని కోరారు. వ్యక్తిగత సిఫార్సులు, వర్గపోరుకు కాకుండా పార్టీ కోసం చెమటోడ్చిన కార్యకర్తల సేవలకు విలువనిచ్చే నిర్ణయాలు తీసుకుంటేనే కార్యకర్తల విశ్వాసం మరింత బలపడుతుందని పేర్కొన్నారు. పార్టీని కష్టకాలంలో నిలబెట్టిన కార్యకర్తల ఆత్మగౌరవాన్ని పరిరక్షించడం ద్వారా మాత్రమే కాంగ్రెస్ మరింత బలోపేతం అవుతుందని, నిబద్ధతతో పనిచేసిన వారికి న్యాయం జరిగేలా అధిష్ఠానం చర్యలు తీసుకోవాలని పార్టీ శ్రేణులు కోరుతున్నాయి.

## ప్రభుత్వ భూమి ఆక్రమణపై వెంటనే చర్యలు తీసుకున్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జులై 13:-
రంగారెడ్డి జిల్లా: మునుగునూరు గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 83లో ప్రభుత్వ భూమిలో సుమారు 200 నుంచి 300 గజాల మేర ప్రహరీ గోడ నిర్మించిన విషయం వెలుగులోకి వచ్చింది. ఈ విషయాన్ని గుర్తించిన సంబంధిత రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (RI) వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ప్రభుత్వ భూమిపై నిర్మించిన ప్రహరీ గోడ అక్రమని నిర్ధారించిన అనంతరం, ఎలాంటి ఆలస్యం చేయకుండా తన ఆధ్వర్యంలో ఆ నిర్మాణాన్ని స్వయంగా తొలగించే చర్యలు చేపట్టారు. ప్రభుత్వ భూములపై ఆక్రమణలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములను కాపాడడం ప్రతి రెవెన్యూ అధికారికి బాధ్యత అని, ఆక్రమణలు జరిగినట్లు గుర్తించిన వెంటనే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని అధికారి తెలిపారు. ప్రభుత్వ భూముల పరిరక్షణలో రెవెన్యూ శాఖ అప్రమత్తంగా వ్యవహరిస్తోందని ఈ ఘటన మరోసారి స్పష్టం చేసింది.

## సింగరేణి అధికారుల సమస్యలపై సత్వరమే సానుకూల నిర్ణయం తీసుకోండి

### – సింగరేణి యాజమాన్యానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశాలు



భద్రాద్రి కొత్తగూడెం, జూలై13(హైదరాబాద్ ఎస్టేట్): సింగరేణిలో విధులు నిర్వహిస్తున్న సుమారు 2,200 మంది అధికారులకు సంబంధించిన సమస్యల పరిష్కారంపై వీలైనంత త్వరగా సానుకూల నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించారు. కోల్ ఇండియా సంస్థల మాదిరిగా సింగరేణి అధికారుల వేతన సవరణ, పర్ఫార్మెన్స్ రిలేటెడ్ పేమెంట్(పిఆర్పి) అమలుకు సంబంధించి అధికార సంఘం నాయకులు చేసిన విజ్ఞప్తులను ప్రాధాన్యంగా పరిగణించి త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ఇటీవల ప్రజా ప్రభుత్వం ప్రత్యేక చొరవతో తాడిచర్ల-2 బ్లాక్‌కు మైనింగ్ లీజు మంజూరు కావడంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పోషించిన కీలక పాత్రకు కృతజ్ఞతలు తెలుపుతూ సింగరేణి అధికార సంఘం నాయకులు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా అధికారులకు సంబంధించిన వివిధ సమస్యలను త్వరగా పరిష్కరించేలా సింగరేణి యాజమాన్యానికి ఆదేశాలు జారీ చేయాలని ఆయనను కోరారు.

ఈ విజ్ఞప్తులపై స్పందించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సోమవారం సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి, డైరెక్టర్(పర్సనల్ అండ్ ఫైనాన్స్)గౌతమ్ పోట్రుతో సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. ప్రజా ప్రభుత్వం సింగరేణి అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధికి ఇంధన భద్రతను అందించడంలో సింగరేణి కార్మికులు అధికారులు విశేష కృషి చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. అధికారుల్లో ఎలాంటి అసంతృప్తి నెలకొనకుండా వారి సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికార సంఘం నాయకులతో చర్చించి వారికి భరోసా కల్పించాలని యాజమాన్యాన్ని ఆదేశించారు. ఎలాంటి జాప్యం లేకుండా రానున్న రెండు నుంచి మూడు నెలల్లో అధికారుల విజ్ఞప్తులపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేశారు. అదేవిధంగా మారుతున్న ప్రపంచీకరణ పరిస్థితులు పెరుగుతున్న పోటీని దృష్టిలో ఉంచుకొని బొగ్గు ఉత్పత్తి విక్రయాల్లో సింగరేణి పోటీతత్వాన్ని మరింత పెంపొందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో సింగరేణిని బహుముఖ రంగాల్లో విస్తరించి అంతర్జాతీయ స్థాయి సంస్థగా తీర్చిదిద్దేందుకు అధికారులు కీలక పాత్ర పోషించాలని ఈ దిశగా అధికార సంఘం నాయకులు కూడా అధికారుల్లో సానుకూల దృక్పథం కపెంపొందించేలా కృషి చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచించారు.

ఉప ముఖ్యమంత్రికి సింగరేణి అధికార సంఘం నాయకుల కృతజ్ఞతలు

సింగరేణి సుస్థిర భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని కొత్త బొగ్గు బ్లాక్‌ల సాధనకు కృషి చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు సింగరేణి అధికార సంఘం అధ్యక్షుడు తాళ్లపల్లి లక్ష్మీపతి గౌడ్, ప్రధాన కార్యదర్శి పెద్ది నరసింహులు కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవలే రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసి తమ సమస్యలను వివరించామని దీనిపై ఆయన సానుకూలంగా స్పందించి సత్వరమే పరిష్కరించాలని యాజమాన్యానికి ఆదేశాలు జారీ చేయడంపై వారు ఉప ముఖ్యమంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి అభివృద్ధి విస్తరణ సుస్థిర భవిష్యత్ కోసం చేపడుతున్న ప్రతి కార్యక్రమానికి అధికారుల తరపున సంపూర్ణ మద్దతు అందిస్తూ సంస్థ పురోగతి కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తామని వారు స్పష్టం చేశారు.

## నైపుణ్యాల మెరుగుతోనే ఉజ్వల భవిష్యత్

### ఓయు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.నరేష్ రెడ్డి






హైదరాబాద్, జూలై 12: విద్యార్థులు తమ నైపుణ్యాలను మెరుగుపర్చుకున్నప్పుడే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఉస్మానియా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.నరేష్ రెడ్డి అన్నారు. అవంతి డిగ్రీ అండ్ పీజీ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం కాచిగూడ లోని మ్యాడం అంజయ్య హాల్ లో అవంతి విద్యా సంస్థల చైర్మన్, మాజీ మంత్రి ఎం.శ్రీనివాసరావు అధ్యక్షతన ఘనంగా జరిగింది. కళాశాలలో చదివి ప్రస్తుతం ఉన్నత శిఖరాలను అధిరోహించిన పూర్వ విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై తమ పాత జ్ఞాపకాలను, అనుభవాలను తోటి విద్యార్థులతో ఉత్సాహంగా పంచుకున్నారు. ఈ సందర్భంగా నరేష్ రెడ్డి మాట్లాడుతూ... ప్రస్తుతం విద్యా, ఉపాధి రంగంలో నైపుణ్యాభివృద్ధి అనేది ఎంతో కీలకమైనదని విద్యార్థులు కొత్త విషయాలను నేర్చుకోవడంతో పాటు శోధనా సామర్థ్యాలను పెంచుకోవాలని సూచించారు. ఇండస్ట్రీకి అవసరమైన స్కిల్ బేస్డ్ విద్యను అందించే విధంగా ఓయు కృషి చేస్తుందని ఆయన అన్నారు. 35 సంవత్సరాలుగా విద్యాభివృద్ధికి, విద్యార్థుల పురోభివృద్ధికి అవంతి విద్యా సంస్థలు చేస్తున్న కృషి ప్రశంసనీయమని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.ప్రియాంక, డాక్టర్ ఎం.ఎ. హమీద్, సూరంపూడి సోనియా శ్రీకాంత్, ప్రొఫెసర్ ఇంద్రకంటి శేఖర్, జక్కుల సత్యనారాయణ, డాక్టర్ వేణుగోపాల్, డాక్టర్ వై.జయప్రద, ప్రొఫెసర్ ఎస్.అప్పారావు, డాక్టర్ స్వాతి, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది. పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఓటు హక్కు పరిరక్షణకు 'ఎస్ఐఆర్" అవకాశాన్ని వినియోగించుకోవాలి

### ఫారాల వినియోగం, నమోదు ప్రక్రియపై ఎమ్మార్వో విక్రం వివరణ

### 'సర్" అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఐనవోలు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నకరకంటి మోహన్ గౌడ్



హనుమకొండ, జూలై 13
ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై అయినవోలు మండలంలోని పంతిని, పున్నెల్,
ఐనవోలు గ్రామాల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, ఓటర్లకు ఎస్ఐఆర్‌లో ఉపయోగించే వివిధ దరఖాస్తు ఫారాలు, నమోదు ప్రక్రియ, అర్హతలు, సవరణలు, ఓటరు జాబితాలో వ్యక్తిగత వివరాల నవీకరణ తదితర అంశాలపై ఎమ్మార్వో విక్రం సమగ్రంగా వివరించారు. ఓటర్ల నుంచి స్వీకరించిన ఎస్ఐఆర్ దరఖాస్తు ఫారాలను నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా తిరిగి సమర్పించాలని ఆయన సూచించారు. ఫారాల పూరణలో ఎలాంటి సందేహాలు లేదా ఇబ్బందులు ఎదురైనా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సంబంధిత బీఎల్ఏలు, బీఎల్ఓలు పూర్తి సహకారం అందించి ఫారాలను సక్రమంగా నింపేందుకు సహాయం చేస్తారని తెలిపారు. ప్రతి అర్హుడైన ఓటరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఓటరు వివరాలను సరిచూసుకుని, అవసరమైన దరఖాస్తులను సమర్పించి తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా
ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని ప్రతి అర్హ ఓటరు సద్వినియోగం చేసుకోవాలని ఐనవోలు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నకరకంటి మోహన్ గౌడ్ పిలుపునిచ్చారు. ఐనవోలు మండలంలోని పంతిని, పున్నెల్, అయినవోలు గ్రామాల్లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మోహన్ గౌడ్ మాట్లాడుతూ.. ఓటరు వివరాలను సకాలంలో సరిచేసుకొని, అవసరమైన ఫారాలను గడువులోపు సమర్పించడం ద్వారా ఓటు హక్కును పరిరక్షించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కత్తి సుధీర్ గౌడ్, రఘు, అయినవోలు 170వ బూత్ బీఎల్ఏ తాటికాయల ప్రశాంత్, పున్నెల్ బీఎల్ఏ ఎడ్ల జగన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి వర్షపు నీటి బొట్టు భవిష్యత్తుకు భరోసా




హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూలై 13:-
వర్షపు నీటిని ప్రతి ఇంటా, ప్రతి ప్రాంతంలో సంరక్షించి భూగర్భ జలాలను పరిరక్షించాలని మున్సిపల్ అధికారులు పిలుపునిచ్చారు. జల్ సంచయ్ జన భాగిదారి3 కార్యక్రమంలో భాగంగా చేపట్టిన "వర్షాన్ని పట్టుకుందాం" ప్రచారంలో భాగంగా వర్షపు నీటి సంరక్షణ గుంతలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, స్థానిక కౌన్సిలర్, మున్సిపల్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు. వర్షాకాలంలో కురిసే నీటిని వృథా కాకుండా భూమిలోకి ఇంకేలా సంరక్షణ గుంతలను ఏర్పాటు చేయడం వల్ల భూగర్భ జలాల మట్టం పెరుగుతుందని అధికారులు వివరించారు. నీటి కొరతను నివారించడానికి ప్రతి ఇల్లు, ప్రతి కార్యాలయం, ప్రతి ప్రభుత్వ భవనంలో వర్షపు నీటి సంరక్షణ వ్యవస్థలను ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని తెలియజేశారు.

ప్రజలు నీటి వినియోగంలో బాధ్యతగా వ్యవహరించి, వర్షపు నీటి సంరక్షణను సామాజిక బాధ్యతగా స్వీకరించాలని సూచించారు. ప్రకృతి ప్రసాదించిన ప్రతి నీటి బొట్టును కాపాడితేనే భవిష్యత్ తరాలకు నీటి భద్రత కల్పించగలమని పేర్కొన్నారు.

ఈరోజు వర్షపు నీటిని సంరక్షిద్దాం రేపటి నీటి భద్రతను కాపాడుకుందాం" అనే సందేశంతో కార్యక్రమం ముగిసింది.

# అమరవీరుల త్యాగాలను గానం చేసినవాడు అరుణోదయ నాగన్న

## -- సీపీఐ (యం-యల్) న్యూడెమోక్రసీ,



హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి నల్గొండ

సీపీఐ (యం-యల్) న్యూడెమోక్రసీ తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు, అరుణోదయ వ్యవస్థాపక సభ్యులు, విప్లవ సాంస్కృతిక ఉద్యమ నాయకుడు, అరుణోదయ గౌరవ అధ్యక్షులు కామ్రేడ్ అరుణోదయ నాగన్న సంతాప సభను సీపీఐ (యం-యల్) న్యూడెమోక్రసీ నగర కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని శ్రామిక భవన్ లో బొమ్మిడి నగేష్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. కామ్రేడ్ నాగన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించడం జరిగింది.

ఈ సందర్భంగా సీపీఐ (యం-యల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి సాగర్ మాట్లాడుతూ కామ్రేడ్ అరుణోదయ నాగన్న ఎమర్జెన్సీ కాలంలో విప్లవోద్యమానికి ఆకర్షితులై నాటినుండి నేటి వరకు సాంస్కృతిక ఉద్యమంలో అలుపెరగని కృషి చేశారన్నారు. ప్రజలను చైతన్యవంతం చేయడం కోసం అనేక ప్రజా కళారూపాలను, బుర్రకథలను, జానపదులను రచించడమే గాకుండా స్వయంగా తానే పాడి ప్రజలను మేలుకొలిపారన్నారు. కామ్రేడ్ అరుణోదయ నాగన్న పాడిన పాటలు రెండు తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా దేశవ్యాప్తంగా ప్రాచుర్యం పొందాయ అన్నారు. సద్దాం హుస్సేన్, గోదావరి లోయ ప్రతిఘటన ఉద్యమ అమర వీరులు ఎల్లన్న, బాటన్న, ముష్కి, కాచనపల్లి అమరవీరులు తో మొదలుపెట్టి రవన్న,లింగన్న వరకు అమరవీరులను ప్రజల గుండెల పై స్థిర స్థాయిగా నిలిచిపోయేలా పాటలు పాడారనీ అన్నారు. అరుణోదయ నాగన్న తుది శ్వాస వరకు సీపీఐ (ఎం ఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడిగా కొనసాగరని తెలిపారు. పేదరికం అనారోగ్యంతో పోరాటం చేస్తూనే తన తుది శ్వాస వరకు విప్లవ ఉద్యమంలో పనిచేశారన్నారు. కామ్రేడ్ అరుణోదయ నాగన్న మరణం సాంస్కృతిక ఉద్యమానికి, విప్లవ ఉద్యమానికి తీరని లోటుని అన్నారు. నాగన్న ఆశయాలైన నూతన ప్రజాస్వామిక విప్లవం కోసం ప్రజాయుద్ధ పంథా లో పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. నేడు దేశంలో మోడీ ప్రభుత్వం ఫాసిస్ట్ విధానాలను వేగవంతం చేశాడాని అన్నారు. ప్రజల దోచి కార్పొరేట్ కు కట్టబెట్టడమే మోడీ ప్రభుత్వ అభివృద్ధి అని అన్నారు. ఫాసీజం వైపు వేగంగా దేశాన్ని నెట్టివేస్తున్నారని అన్నారు. ఈ విధానాలపై అరుణోదయ నాగన్న అందించిన పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ఐ ఎఫ్ టీ యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శిలు బొంగరాల నర్సింహా, బొమ్మిడి నగేష్, పివైయల్ జిల్లా కార్యదర్శి బి. వి చారి, ఏఐకెఎంఎస్ జిల్లా నాయకులు కల్లూరి అయోధ్య, ఐ ఎఫ్ టీ యూ జిల్లా నాయకులు రావుల వీరేష్, చింతల వెంకటరమణ, దాసరి నర్సింహా, కత్తుల చంద్రశేఖర్, పట్టణ నాయకులు బోల్లేపల్లి రామకృష్ణ, క్రాంతి, మామిడాల ప్రవీణ్, సుఖేందర్ తదితరులు పాల్గొన్నారు.

...ఇట్లు...
బొమ్మిడి నగేష్
సీపీఐ యం యల్ న్యూడెమోక్రసీ
నల్లగొండ నగర కమిటీ

# ప్రేమ పేరుతో మైనర్‌పై లైంగిక దాడి.. యువకుడి అరెస్ట్

## పోక్సో చట్టం కింద కేసు నమోదు – నిందితుడు రిమాండ్‌కు




గీసుగొండ, జూలై 13 హైదరాబాద్ ఎస్టేట్:

ప్రేమ పేరుతో మైనర్ బాలికను నమ్మించి లైంగిక దాడి చేసి, అనంతరం వేధింపులకు పాల్పడినట్లు నమోదైన పోక్సో కేసులో ఓ యువకుడిని గీసుగొండ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం, పదో తరగతి చదువుతున్న సమయంలో బాధితురాలికి పరిచయమైన యువకుడు వివాహం చేసుకుంటానని నమ్మించి లైంగిక దాడికి పాల్పడ్డాడని, ఆ తర్వాత కొంతకాలం పాటు ఆమెను వేధిస్తూ బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇటీవల బాధితురాలిపై దాడి చేసి ఆమె మొబైల్ ఫోన్‌ను ధ్వంసం చేసినట్లు కూడా ఫిర్యాదులో వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు, నిందితుడు బొడ్డు బన్నీ (21), ధర్మసాగర్ మండలంను అదుపులోకి తీసుకుని సంబంధిత భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) నిబంధనలతో పాటు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. అనంతరం న్యాయస్థానం ఎదుట హాజరుపర్చగా రిమాండ్ విధించినట్లు వెల్లడించారు. మైనర్లపై లైంగిక నేరాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు కొనసాగుతాయని ఏసీపీ వెంకటేష్ తెలిపారు. ఇలాంటి కేసుల్లో నిందితులపై అవసరమైతే రౌడీషీట్లు కూడా తెరుస్తామని హెచ్చరించారు. కేసు దర్యాప్తును ఏసీపీ వెంకటేష్ పర్యవేక్షణలో గీసుగొండ ఇన్‌స్పెక్టర్ విశ్వేశ్వర్, ఎస్సై కుమార్ నిర్వహించారు.

# కన్నెపల్లి మోటార్లు నడపాలి : బీఆర్ఎస్

## సాగునీటి విషయంలో ప్రభుత్వం రాజకీయాలు మానుకోవాలి

## సీఎం వ్యాఖ్యలపై తీవ్ర అభ్యంతరం







హన్మకొండ, జులై 13 హైదరాబాద్ ఎస్టేట్:

రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులకు సాగునీరు అందించేందుకు కన్నెపల్లి, దేవాదుల పంప్‌హౌస్‌లను వెంటనే ప్రారంభించాలని బీఆర్ఎస్ డిమాండ్ చేసింది. బాలసముద్రంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు మాట్లాడుతూ, సాగునీటి అంశాన్ని రాజకీయ కోణంలో కాకుండా రైతుల ప్రయోజనాల దృష్ట్యా చూడాలని ప్రభుత్వానికి సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్టు, మేడిగడ్డ బ్యారేజ్, కన్నెపల్లి పంప్‌హౌస్‌లపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు వాస్తవ పరిస్థితులకు భిన్నంగా ఉన్నాయని ఆయన ఆరోపించారు. కన్నెపల్లి ద్వారా నీటిని ఎత్తిపోసే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం ఎన్‌డీఎస్‌ఏ నివేదిక పేరుతో నిర్ణయాలను వాయిదా వేస్తోందని విమర్శించారు. పంటలు ఎండిపోకుండా సాగునీటి విడుదలపై తక్షణ నిర్ణయం తీసుకోవాలని కోరారు.బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సాగునీటి విస్తీర్ణం గణనీయంగా పెరిగిందని పేర్కొంటూ, ప్రస్తుత ప్రభుత్వం రైతులకు అందించిన ప్రయోజనాలపై స్పష్టమైన వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తి సామర్థ్యంతో వినియోగించి రైతులకు మేలు చేయడమే ప్రభుత్వ ప్రాధాన్యంగా ఉండాలని అన్నారు. ముఖ్యమంత్రి చేసిన కొన్ని వ్యాఖ్యలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి అనుకూలంగా లేవని పేర్కొన్న రవీందర్ రావు, ప్రజాప్రతినిధులు సంయమనం పాటిస్తూ ప్రజల్లో విశ్వాసాన్ని పెంచే విధంగా వ్యవహరించాలని సూచించారు. రైతుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైతే ప్రజాస్వామ్యబద్ధంగా ఉద్యమాన్ని మరింత విస్తరిస్తామని హెచ్చరించారు.

చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి: కేతిరెడ్డి

తెలంగాణ రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ కేతిరెడ్డి వాసుదేవ రెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలపై సమగ్ర విచారణ జరిపి సంబంధిత చట్టాల ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కరువు వేళ రైతులకు సాగునీరు అందించడం ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని పేర్కొంటూ, రాజకీయ విభేదాలను పక్కనబెట్టి వ్యవసాయ రంగాన్ని ఆదుకోవాలని సూచించారు. రైతులు, విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, లేకపోతే ప్రజాస్వామ్యబద్ధంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు.

# చిన్న జీయర్ స్వామి ఆశీస్సులతో జనప్రియ ఎలిసియం విల్లా ప్రారంభం



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జులై 13:-

రంగారెడ్డి జిల్లా: బాటసింగారంలో జనప్రియ సంస్థ ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న ఎలిసియం విల్లా ప్రాజెక్ట్‌కు ఆదివారం ఘనంగా శ్రీకారం చుట్టారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి త్రిదండి రామానుజ చిన్న జీయర్ స్వామి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రాజెక్ట్ విజయవంతం కావాలని ఆశీర్వదించారు. శాసన మండలి సభ్యుడు (ఎంఎల్‌సీ) గుత్తా సుఖేందర్ రెడ్డితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రాజెక్ట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా జనప్రియ సంస్థ చైర్మన్ రవీందర్ రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ క్రాంతి కిరణ్ రెడ్డి, డైరెక్టర్ బాల్ రెడ్డి మాట్లాడుతూ, బాటసింగారంలోని సుందరమైన గుట్టల మధ్య సుమారు 25 ఎకరాల విస్తీర్ణంలో అత్యాధునిక సౌకర్యాలతో కూడిన 189 పూర్తి స్థాయి సెంట్రల్ ఎయిర్ కండీషన్డ్ విల్లాలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. నాణ్యత, ఆధునిక నిర్మాణ ప్రమాణాలు, విశాలమైన పచ్చదనం, భద్రతా ఏర్పాట్లతో ఈ ప్రాజెక్ట్‌ను రూపుదిద్దుతున్నామని పేర్కొన్నారు.ప్రారంభోత్సవ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, ఆహ్వానితులు, రియల్ ఎస్టేట్ రంగానికి చెందిన ప్రముఖులు, కొనుగోలుదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రంగారెడ్డిలో జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవానికి శ్రీకారం




హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జులై 13:-


రంగారెడ్డి జిల్లా: జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవానికి శ్రీకారం

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం నల్లకంచె గ్రామంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ బాలికల పాఠశాల, కళాశాలలో సోమవారం జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా అదనపు కలెక్టర్ డా. కిరణ్మయి ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థినులకు ఆల్బెండాజోల్ మాత్రలు పంపిణీ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నులి పురుగుల నివారణతో పిల్లల్లో రక్తహీనత, పోషకాహార లోపం వంటి సమస్యలు తగ్గి శారీరక, మానసిక వికాసం మెరుగుపడుతుందని తెలిపారు. జిల్లాలో అర్హులైన ప్రతి చిన్నారికి ఈ మాత్రలు అందేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు.

జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డా. స్వర్ణ కుమారి మాట్లాడుతూ, జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఒకటి నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు ఆల్బెండాజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. విద్యాశాఖ, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖల సహకారంతో కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నామని, ప్రతి అర్హత కలిగిన బాలబాలిక ఈ కార్యక్రమంలో పాల్గొని మాత్రలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా. షీబా, ఉప జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డా. సత్యరత్న, వైద్య అధికారులు, ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో 103 వినతులు..

## త్వరిత పరిష్కారానికి కలెక్టర్ ఆదేశం



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూలై 13:-

రంగారెడ్డి జిల్లా: ప్రజల నుంచి అందిన ప్రతి ఫిర్యాదును నిర్లక్ష్యం చేయకుండా నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మొత్తం 103 ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. ప్రజలు సమర్పించిన ప్రతి వినతిని సంబంధిత శాఖలు క్షుణ్ణంగా పరిశీలించి, పెండింగ్‌లో ఉంచకుండా సత్వర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు పారదర్శకంగా, జవాబుదారీతనంతో సేవలు అందించాలని అధికారులకు సూచించారు. అందిన దరఖాస్తుల్లో రెవెన్యూ శాఖకు 23, ఇతర శాఖలకు 80 వినతులు ఉన్నాయి. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు కె. కిరణ్మయి, కె. చంద్రారెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి శారదతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ఫారం సమర్పించకపోతే ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం

## బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూలై 13:-

రంగారెడ్డి జిల్లా: ఇబ్రహీంపట్నం, ఓటరు గుర్తింపు కార్డు ఉన్నంత మాత్రాన ఓటరు జాబితాలో పేరు శాశ్వతంగా ఉంటుందని భావించడం సరైంది కాదని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో ప్రతి అర్హుడైన ఓటరు తప్పనిసరిగా ఎన్యూమరేషన్ ఫారాన్ని నింపి బూత్ లెవల్ అధికారికి (బీఎల్ఓ) అందజేయాలని సూచించారు. ఎస్ఐఆర్ ఫారం సమర్పించని వారి పేర్లు ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఓటరు జాబితా నుంచి తొలగించే అవకాశం ఉంటుందని ఆయన హెచ్చరించారు. అలాంటి పరిస్థితిలో చేతిలో ఓటరు కార్డు ఉన్నప్పటికీ ఓటు హక్కును వినియోగించుకోలేని పరిస్థితి ఏర్పడవచ్చని అన్నారు. తెలంగాణలో ఎస్ఐఆర్ ఫారం సమర్పణకు జూలై 24, 2026 చివరి తేదీ అని గుర్తుచేస్తూ, ప్రతి ఓటరు వెంటనే తమ బీఎల్ఓను సంప్రదించి ఫారాన్ని సమర్పించాలని కోరారు. ఫారంలో సరైన వివరాలను నమోదు చేసి గడువులోగా అందజేయడం ద్వారా ఓటు హక్కును పరిరక్షించుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు అమూల్యమైందని, నిర్లక్ష్యం వల్ల ఓటు హక్కును కోల్పోయే పరిస్థితి రాకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి ప్రజలని ఉద్దేశించి హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధితో తెలియ చేశారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి: ట్రాఫిక్ డీసీపీ

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జులై 13:-

మహేశ్వరం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను ఫ్యూచర్ సిటీ ట్రాఫిక్ డీసీపీ శివం ఉపాధ్యాయ, ఐపీఎస్ సోమవారం తనిఖీ చేసి సిబ్బందికి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రజల ప్రాణ భద్రతే లక్ష్యంగా ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగాన్ని తప్పనిసరి చేస్తూ ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకోవాలని, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను నిరంతరం నిర్వహించాలని ఆదేశించారు. పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాలు, ఇతర ప్రజా ప్రదేశాల్లో ట్రాఫిక్ అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని సూచించారు. పెండింగ్ ట్రాఫిక్ చలాన్ల వసూళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు.వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నీరు నిలిచే ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన ట్రాఫిక్ నియంత్రణ చర్యలు తీసుకోవాలని, అలాంటి ప్రాంతాల సమాచారాన్ని వెంటనే జీహెచ్ఎంసీ అధికారులకు చేరవేయాలని ఆదేశించారు. విధుల నిర్వహణలో ట్రాఫిక్ పరికరాలతో పాటు రెయిన్‌కోట్ తప్పనిసరిగా వెంట ఉంచుకోవాలని సూచించారు.ఈ తనిఖీలో మహేశ్వరం ట్రాఫిక్ ఏసీపీ ఎ. చంద్రశేఖర్, ఎస్‌హెచ్ఓ జి. వెంకటేశ్వర్ రావు తదితర ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

RNI No Tel / 2012 /4241
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER తెలుగు దిన పత్రిక hyderabadestate.co.in



## ఆస్తి ఇచ్చిన తల్లికి చివరికి చెట్టు కిందే ఆశ్రయం..

### కొడుకులపై కన్నీటి ఫిర్యాదు.. 82 ఏళ్ల వృద్ధురాలి ఆవేదన



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జులై 13:- రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం గాజులగూడ గ్రామానికి చెందిన 82 ఏళ్ల కోమటిరెడ్డి సుశీలమ్మ తన జీవితాంతం కూడబెట్టిన ఆస్తినే తనకు శాపంగా మారిందంటూ కన్నీటి పర్యంతమయ్యారు. తనకు ఉన్న 15 ఎకరాల భూమిలో 13 ఎకరాలను ఇద్దరు కుమారుల పేర్లపై నమ్మకంతో రిజిస్ట్రేషన్ చేయించానని, మిగిలిన 2 ఎకరాలను విక్రయించగా వచ్చిన రూ.2.70 కోట్లను చిన్న కుమారుడు తీసుకున్నాడని ఆమె ఆరోపించారు. ఆస్తి అంతా వారి చేతికి వెళ్లిన తర్వాత తనను పట్టించుకోవడం మానేశారని, కనీసం అన్నం కూడా పెట్టకుండా ఇంటి నుంచి వెళ్లగొట్టారని వృద్ధురాలు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం చెట్టు కిందే తలదాచుకుంటూ దయనీయ పరిస్థితుల్లో జీవిస్తున్నానని ఆమె వాపోయారు. తనకు న్యాయం జరిగేలా సంబంధిత అధికారులు వెంటనే జోక్యం చేసుకుని, తన డబ్బులు లేదా భూమిని తిరిగి ఇప్పించాలని సుశీలమ్మ వేడుకుంటున్నారు. తల్లిదండ్రులపై నిర్లక్ష్యం పెరుగుతున్న ఈ ఘటన స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

## ప్రధాన్ మంత్రి జన ధన్ యోజన (PMJDY) 2026 దరఖాస్తు ఫారం విడుదలైంది




అర్హులైన భారతీయ పౌరుల కోసం ప్రధాన మంత్రి జన ధన్ యోజన (ావీజీణ్) 2026 దరఖాస్తు ఇప్పుడు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంది. ప్రధాన్ మంత్రి జన ధన్ యోజన (ావీజీణ్) 2026 ద్వారా 1365 సంవత్సరాల మధ్య వయస్సు గల అర్హులైన భారతీయ పౌరులకు ₹50,000 నుండి ₹200,000 వరకు ఆర్థిక సహాయం అందించబడుతుంది.

వయస్సు 1325 (₹50,000₹90,000)

వయస్సు 2565 (₹90,000₹200,000)

ఆమోదం పొందిన దరఖాస్తుదారులకు చెల్లింపులు ప్రారంభమయ్యాయి. లబ్ధిదారుల్లో ఒకరిగా మారేందుకు ఇప్పుడే నమోదు చేసుకోండి. అర్హతను పరిశీలించి ఇక్కడ దరఖాస్తు చేయండి https://udqw.ehljc.Iyz/HEjdiPjuh/b232457320ed6ea311d9e7b43d?pRw

## విద్యారంగంపై ప్రభుత్వం ఫోకస్...

### – నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా ముందుకు...

### – మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యత..





హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి పెద్దపల్లి గౌరవ ప్రభుత్వ విప్,పెద్దపల్లి శాసనసభ్యులు శ్రీ. చింతకుంట విజయ రమణారావు పెద్దపల్లి మండలంలోని హనుమంతుని పేట, మారేడు గొండ , మూలసాల, గుర్రంపల్లి గ్రామాల్లో డిఎంఎఫ్ టి నిధులు రూ.1.18 కోట్ల వ్యయం తో సోమవారం రోజున ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణం, రిపేర్లు, టాయిలెట్స్, కిచెన్ షెడ్ల నిర్మాణానికి స్థానిక నాయకులతో కలిసి శంకుస్థాపన చేసిన గౌరవ ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు శ్రీ.చింతకుంట విజయరమణ రావు గారు.. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయరమణ రావు గారు మాట్లాడుతూ...పెద్దపల్లి మండలంలోని పలు గ్రామాల్లో మొత్తం రూ.5.70 కోట్ల నిధులు స్కూళ్లలో మౌలిక సదుపాయాల నిర్మాణానికి మంజూరు పొందినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ప్రభుత్వ బడులను బలోపేతం చేసేందుకు పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేస్తున్నారని చెప్పారు. మధ్యాహ్న భోజనంతోపాటు ఉదయం అల్పాహారం అందించడం జరుగుతోందని అన్నారు. నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఎస్ ఎస్ సీ ఫలితాల్లో గత సంవత్సరం రాష్ట్రంలోనే పెద్దపల్లి జిల్లా అగ్రభాగాన నిలవడం అభినందనీయమని చెప్పారు. ఇందులో పెద్దపల్లి జిల్లాలో పెద్దపల్లి మండలం ముందు ఉన్నదని అన్నారు. ఉపాధ్యాయులు, అంగన్వాడి టీచర్లు, ఆయాలు, విద్యాశాఖ అధికారులు అంకితభావంతో విధులు నిర్వహించడం వల్లనే ప్రభుత్వ బడులలో మంచి ఫలితాలు వస్తున్నాయని అభినందించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పాలకులు పెద్దపల్లి నియోజకవర్గం లోని ప్రభుత్వ స్కూల్స్ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించారని అన్నారు. తమ సొంత ప్రైవేట్ విద్యాసంస్థల అభివృద్ధిని పెంచుకునేందుకు ప్రభుత్వ స్కూల్స్ అభివృద్ధిని అడ్డుకున్నారని చెప్పారు. హనుమంతుని పేట పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 200 మందికి పెరిగిందన్నారు. ప్రభుత్వ స్కూల్స్ పట్ల ప్రజల్లో విశ్వాసం పెరుగుతోందని చెప్పారు. రానున్న రోజుల్లో స్కూల్స్ లలో టీచర్లు విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు కృషి చేయాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో పలు గ్రామాల సర్పంచ్ లు, ఉపసర్పంచ్ లు మరియు మండల పార్టీ అధ్యక్షులు మరియు పలు పాఠశాలాల ఉపాధ్యాయులు.,సిబ్బంది మరియు ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు విద్యార్థులు మరియు గ్రామస్తులు,

# ప్రజా ఆరోగ్యాలను కాపాడండి.

### కోడి వ్యర్థాలతో పెంచుతున్నక్యాట్ ఫిష్, ఇతర చేపలను పెంపకం చేస్తున్న వ్యక్తుల పైన అధికారులు చర్యలు తీసుకోవాలి.

### పల్నాడు జిల్లా డీఆర్వో కు వినతిపత్రం అందజేసిన నాయకులు

నరసరావుపేట / ప్రజా ఆరోగ్యాలను కాపాడవలసిన అధికారులు చోద్యం చూసే పరిస్థితి నెలకొని ఉందని, భారత ప్రభుత్వం నిషేధించిన 'క్యాట్ ఫిష్' పెంపకం చిలకలూరిపేట మండలంలోని బొప్పూడి శివార్లలో వ్యవసాయ భూములను తవ్వేసి సుమారు 8 భారీ చెరువులు ఏర్పాటు చేసి యధేచ్చగా ప్రమాదకరమైన క్యాట్ ఫిష్‌లను పెంచుతూన్నారు. అదేవిధంగా వినుకొండ పరిసర ప్రాంతాలతో పాటు మరి కొన్ని నియోజకవర్గాల్లో ఇదేవిధంగా జరుగుతుందని ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా సోమవారం పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డిఆర్వో కె. అద్దెయ్య నాయకులు వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ క్యాట్ ఫిష్ కు మేతగా కుళ్ళిన కోళ్లు, వ్యర్థాలు, జంతు కళేబరాలు పెడుతున్నారు.ఈ క్యాట్ ఫిష్ పెంపకం వల్ల జరిగే అనర్థాలను గుర్తించిన భారత ప్రభుత్వం దీనిపై ఎప్పుడో ఉక్కుపాదం మోపిందన్నారు. ఈ చేపలను తింటే మనుషులకు జీర్ణవ్యవస్థ పూర్తిగా నాశనమై, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల బారిన పడే ప్రమాదమని ఆరోగ్యశాఖ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇతర చేపలకు కూడా ఇదే విధమైన ఆహారం పెడుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు దృష్టి సారించి దీని వెనుకాల ఎవరున్నారో తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనధికారికంగా తవ్విన చెరువులను పూడ్చివేసి ప్రజల ఆరోగ్యాలను అధికారులు కాపాడాలన్నారు. పల్నాడు జిల్లా మత్స్యశాఖ జెడి ప్రసాద్ కు డీఆర్వో ఆదేశాలు జారీ చేశారు. ఈ సమస్యను తక్షణమే పరిష్కారం అయ్యే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు ఉప్పలపాటి




రంగయ్య(సిపిఐ)గిరిజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి బి. శ్రీను నాయక్ అన్నారు. పల్నాడు జిల్లా అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా అధ్యక్షులు మహంకాళి సుబ్బారావు, జిల్లా కమిటీ సభ్యులు బి. రాంబాబు నాయక్ తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

# వర్షాల కోసం వరుణ ఘటాభిషేకం

### నల్లబెల్లి శివాలయంలో ప్రత్యేక పూజలు

### రైతుల పంటలు సమృద్ధిగా పండాలని, గ్రామ సుభిక్షం కోసం సామూహిక సంకల్పం

వర్ధన్నపేట, జూలై 13 హైదరాబాద్ ఎస్టేట్: వ్యవసాయానికి జీవనాధారమైన వర్షాలు సకాలంలో సమృద్ధిగా కురిసి రైతుల శ్రమకు తగిన ఫలితం దక్కాలని, చెరువులుకుంటలు జలకళతో కళకళలాడాలని, గ్రామం సస్యశ్యామలంగా మారాలని ఆకాంక్షిస్తూ వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం నల్లబెల్లి గ్రామంలోని శ్రీ ఉమామహేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం భక్తిశ్రద్ధలతో వరుణ ఘటాభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు నాగరాజు ఆధ్వర్యంలో వేద బ్రాహ్మణులు వేదమంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జక్కి అనిత శ్రీకాంత్ పాల్గొని, శివుని అనుగ్రహంతో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతుల పంటలు పుష్కలంగా పండాలని, గ్రామ ప్రజలు





ఆయురారోగ్యాలు, సుఖశాంతులు, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ప్రత్యేక సంకల్ప పూజలు నిర్వహించారు. ప్రకృతి అనుకూలిస్తేనే వ్యవసాయం బలోపేతమై గ్రామీణ జీవనం సుభిక్షంగా సాగుతుందని ఆమె పేర్కొన్నారు. పూజా కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మార్గం బిక్షపతి, ఉపసర్పంచ్ మేకల దేవేందర్, బొజ్జ కృష్ణమూర్తి, బొమ్మెర శ్రీనివాస్ గౌడ్, పోలసాని రామచంద్రరావు, దుగ్యాల భాస్కరరావు, దుర్గారావు, బొజ్జ నాగయ్య, వెంకటేశ్వర్లు, భద్రయ్య రాజు, గ్రామ పెద్దలు, రైతులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వరుణదేవుని అనుగ్రహం కోసం సామూహిక ప్రార్థనలు చేశారు.

## ఎమ్మార్పీఎస్ ఉద్యమాల ఫలితంగా అన్ని వర్గాల ప్రజలకు మేలు

### నంది వనపర్తి నూతన ఎమ్మార్పీఎస్ అధ్యక్షునిగా మూలి రాకేష్( లాజర్) నియామకం

### నియామక పత్రాన్ని అందజేసిన వీహెచ్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు కాళ్ల జంగయ్య, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు మూలి మహేష్

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి యాచారం

ఈ రోజు యాచారం మండలం, నంది వనపర్తి గ్రామంలో ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ సమావేశం ఎంఎస్ఎఫ్ గ్రామ శాఖ అధ్యక్షులు ముచ్చర్ల రాకేష్ గారి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా వీహెచ్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు కాళ్ల జంగయ్య, ఎమ్మార్పీఎస్ యాచారం మండల అధ్యక్షులు మూలి మహేష్ మాదిగ పాల్గొని మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ ఉద్యమ ఫలితంగా అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగిందన్నారు, ఆరోగ్యశ్రీ పథకం, వికలాంగులు, వృద్ధులు,వితంతుల, పెన్షన్ పెంపు రేషన్ బియ్యం కోటా పెంపు, కులం పేరు చెప్పుకోవడానికి సిగ్గుపడ్డ మాదిగలు నేడు గర్వంగా నేను మాదిగ అనే చెప్పుకునే స్థాయికి మాదిగ సమాజానికి గుర్తింపు గౌరవం తీసుకొచ్చిన ఘనత పద్మశ్రీ మందకృష్ణ మాది గారిది అని గుర్తు చేశారు.

మాదిగలు విద్య రంగంలో ముందుండాలని ఇకనుంచి చదివే ప్రధానంగా తీసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు.

ఎమ్మార్పీఎస్ రానున్న రోజుల్లో రాజకీయ శక్తిగా తయారు కావాలన్నారు.

ఎమ్మార్పీఎస్ నూతన కార్యవర్గం
.
గ్రామ శాఖ అధ్యక్షులుగా మూళి రాకేష్ (లాజర్)

అధికార ప్రతినిధిగా ముచ్చర్ల యాదగిరి

ఉపాధ్యక్షులుగా గుండ్రపల్లి బుగ్గ రాములు, ముచ్చర్ల సంతోష్.

ప్రధాన కార్యదర్శిగా ముచ్చర్ల సాయికిరణ్
కోశాధికారిగా ఎంజాల రాములు
సహాయ కార్యదర్శిలుగా మూళి విష్ణు, మూళి సూర్య.
ప్రచార కార్యదర్శిగా మూలి శివ.
సలహాదారులుగా

కాళ్ల జంగయ్య
ఎంజాల అంజయ్య
యంజాల చంద్రకాంత్



ముచ్చర్ల వెంకటరమణ
ముచ్చర్ల జంగయ్య
మూలి జంగయ్య
ముచ్చర్ల సతీష్
పంది సుధాకర్
పంది శ్రీను
గడ్డం దయాకర్
గడ్డం సుధాకర్.

## మేఘనకు అండగా ప్రభుత్వం.. రూ.10 లక్షల పరిహారం అందజేత

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జులై 13:- షాబాద్: షాబాద్‌లో జరిగిన రాజ్‌కుమార్ హత్య ఘటనలో బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని శాసన మండలి ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే కాలే యాదయ్య, జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి హామీ ఇచ్చారు. వారు బాధితుల ఇంటిని మరోసారి సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా దివ్యాంగురాలు మేఘనకు ప్రభుత్వం తరఫున రూ.10 లక్షల పరిహార చెక్కును అందజేశారు.మేఘన పరిస్థితిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా పరిశీలించి, ప్రకటించిన ఆర్థిక సాయాన్ని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచారని నాయకులు తెలిపారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడంతో పాటు, ఆమెకు మెరుగైన వైద్యం, మానసిక వికాసం కోసం సికింద్రాబాద్ ప్రభుత్వ పునరావాస కేంద్రంలో చేర్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. బాధిత కుటుంబ సభ్యులు నిందితుడికి కొందరు పోలీసులు సహకరించారని ఆరోపిస్తూ, పోలీసు పెట్రోలింగ్ లోపం వల్లే ఈ దారుణం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేసులో ఎవరైనా నిందితుడికి సహకరించినట్లు విచారణలో తేలితే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ నారాయణరెడ్డి స్పష్టం చేశారు. అలాగే శాబాద్ ప్రాంతంలో పోలీసు పెట్రోలింగ్‌ను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు.మహేందర్ రెడ్డి మాట్లాడుతూ మేఘనకు జీవితకాలం అవసరమైన




ప్రభుత్వ సదుపాయాలు అందిస్తామని, ఆమె తండ్రికి రావాల్సిన కుటుంబ పెన్షన్‌తో పాటు దివ్యాంగుల పెన్షన్ కూడా అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎమ్మెల్యే యాదయ్య బాధిత కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ డాక్టర్ తరుణ్ జోషి, అదనపు డీసీపీ, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

RNI No Tel /2012 /4241
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in

14 మంగళవారం జూలై 2026

# 'లెనిన్' ప్రమోషన్స్‌లో గ్లామర్ షో& భాగ్యశ్రీ హైలైట్!

టాలీవుడ్ క్రేజీ బ్యూటీ భాగ్యశ్రీ బోర్సే ట్రెడిషనల్ లుక్‌లో మెరిసిపోతూ సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. అఖిల్ అక్కినేని హీరోగా నటించిన 'లెనిన్' రేపు (జూలై 10న) థియేటర్లలోకి వస్తున్న సందర్భంగా ఈ భామ అదిరిపోయే ఫోటోషూట్ షేర్ చేసింది. రాయల్ బ్లూ, పాస్టెల్ లైమ్–గ్రీన్ లెహంగా కాంబినేషన్‌లో వింటేజ్ సౌత్ ఇండియన్ లుక్‌తో మైండ్ బ్లాక్ చేస్తోంది. ఈ సినిమాలో తాను పోషించిన 'భారతి' క్యారెక్టర్ అందరి హృదయాల్లో నిలిచిపోతుందని చెప్తూ ప్రమోషన్స్‌లో సెంటర్ ఆఫ్ ఎట్రాక్షన్‌గా నిలిచింది. ఆ విశేషాలు చూద్దాం.. ప్రముఖ డిజైనర్ భార్గవి కునమ్ డిజైన్ చేసిన ట్రెడిషనల్ లెహంగాలో భాగ్యశ్రీ బోర్సే లంగావోణి రాయల్ లుక్‌ను గుర్తుచేస్తోంది. లైమ్–గ్రీన్ కలర్ లంగా, దానికి మ్యాచ్ అవుతూ జరి ఎంబ్రాయిడరీ వర్క్ ఉన్న రాయల్ బ్లూ బ్లౌజ్ ధరించింది. చేతులకు వేసుకున్న బ్లూ అండ్ గోల్డ్ గాజులు, పెటల్స్ బై స్వాతి జ్యువెలరీ ఆమెకు పక్కా పల్లెటూరి అందాన్ని తెచ్చిపెట్టాయి. ఈ ఫోటోలు చూసి ఫ్యాన్స్ ఫిదా అయిపోతున్నారు. అఖిల్ 'లెనిన్' పైనే భారీ ఆశలు: రేపు విడుదల కాబోతున్న 'లెనిన్' సినిమాపై అక్కినేని ఫ్యాన్స్ భారీ ఆశలు పెట్టుకున్నారు. అఖిల్ అక్కినేని కెరీర్‌కు ఈ సినిమా సక్సెస్ ఎంత ముఖ్యమో, హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సేకి కూడా అంతే ముఖ్యం. ఇక కింగ్ నాగార్జున, నిర్మాత సూర్యదేవర నాగవంశీతో పాటు చిత్ర యూనిట్ అంతా సినిమా బ్లాక్‌బస్టర్ హిట్ అవుతుందని ఎంతో ధీమాగా ఉన్నారు. భాగ్యశ్రీ కు వెంటనే ఒక హిట్ అవసరం: టాలీవుడ్‌లోకి వచ్చినప్పటి నుంచి ఆమె పెద్ద ప్రాజెక్టులే చేస్తోంది. రవితేజతో 'మిస్టర్ బచ్చన్', విజయ్ దేవరకొండతో 'కింగ్‌డమ్', రామ్ పోతినేని సరసన 'ఆంధ్రా కింగ్ తాలూకా' వంటి క్రేజీ సినిమాలు చేసింది. అలాగే తమిళం నుంచి డబ్ అయిన 'కాంత' సినిమాలోనూ ఆమే మెయిన్ లీడ్. అయితే దురదృష్టవశాత్తు ఇప్పటివరకు సరైన కమర్షియల్ సక్సెస్ పడలేదు. అందుకే ఈ 'లెనిన్' మూవీపై ఆమె ఎన్నో ఆశలు పెట్టుకుంది. చేతిలో ఉన్న క్రేజీ ప్రాజెక్టులు: హిట్స్ లేకపోయినా భాగ్యశ్రీ క్రేజ్‌కు, అవకాశాలకు వచ్చిన ఢోకా ఏమీ లేదు. ప్రస్తుతం తమిళ స్టార్ హీరో శివకార్తికేయన్ సరసన 'సియోన్' అనే ప్రతిష్టాత్మక చిత్రంలో నటిస్తోంది. ఇది కాకుండా టాలీవుడ్‌లో మరికొందరు స్టార్ హీరోల సినిమాలకు సంబంధించి చర్చలు జరుగుతున్నాయి. అయితే ఇండస్ట్రీలో మరింత నిలదొక్కుకోవడానికి, రెమ్యూనరేషన్ పెరగడానికి ఈమెకు ఒక సాలిడ్ హిట్ చాలా అవసరం. స్టైల్, గ్లామర్, యాక్టింగ్ పరంగా భాగ్యశ్రీ బోర్సే ఎప్పుడూ బెస్ట్ ఇస్తూనే ఉంటుంది. 'లెనిన్' సినిమాలో 'భారతి'గా ఆమె పాత్ర ప్రేక్షకులను ఏ మేరకు మెప్పిస్తుందో చూడాలి. మరి రేపు రాబోతున్న ఈ సినిమా భాగ్యశ్రీ బోర్సే కెరీర్‌ను మలుపు తిప్పి, టాలీవుడ్‌లో లక్కీ హీరోయిన్‌గా మారుస్తుందో లేదో తెలియాలంటే కొన్ని గంటలు ఆగాల్సిందే.



# 'పెదనాన్నా, మీ ప్రేమ వెలకట్టలేనిది'

## : చిరంజీవి ట్వీట్‌పై స్పందించిన అఖిల్



అక్కినేని అఖిల్ కథానాయకుడిగా నటించిన 'లెనిన్' చిత్రం బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని సాధించింది. ఈ నేపథ్యంలో మెగాస్టార్ చిరంజీవి చిత్ర బృందాన్ని అభినందిస్తూ, అఖిల్ నటనపై ప్రశంసల జల్లు కురిపించారు. మెగాస్టార్ స్పందించడంపై అఖిల్ 'ఎక్స్' వేదికగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ చిత్ర విజయంపై చిరంజీవి "ఎక్స్" వేదికగా స్పందిస్తూ, "లెనిన్ చిత్రానికి వస్తున్న ఆదరణ చూస్తుంటే చాలా ఆనందంగా ఉంది. అఖిల్ నాకు మరో కొడుకు లాంటి వాడు. ప్రతి సినిమాతో నటుడిగా తను ఎదుగుతుండటం సంతోషాన్నిస్తోంది" అని పోస్ట్ చేశారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాతతో పాటు సహనటుడు నాగార్జునకు, చిత్ర యూనిట్ సభ్యులందరికీ ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. చిరంజీవి చేసిన పోస్ట్‌పై అఖిల్ కృతజ్ఞతలు తెలుపుతూ స్పందించారు. "పెదనాన్నా, మీ ప్రేమ ఎప్పుడూ వెలకట్టలేనిది. మీ మద్దతుకు ధన్యవాదాలు" అని ట్వీట్ చేశారు. ఇంకా సినిమా చూడని వారు థియేటర్లకు వెళ్లి వీక్షించాలని ఈ సందర్భంగా అఖిల్ కోరారు. మురళీ కిశోర్ అబ్బూరి దర్శకత్వంలో తెరకెక్కిన 'లెనిన్' జూలై 10న విడుదలైంది. ఈ యాక్షన్ డ్రామాకు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. పాజిటివ్ టాక్‌తో దూసుకుపోతున్న ఈ చిత్రం అఖిల్ కెరీర్‌లోనే భారీ బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. కేవలం తొలి వీకెండ్‌లోనే డిస్ట్రిబ్యూటర్లు తమ పెట్టుబడులను రాబట్టుకోవడం గమనార్హం.

# అఖిల్.. అక్కినేని కుటుంబంలో నువ్వే బెస్ట్ యాక్టర్...

## నాగార్జున మీద ఒట్టు : రామ్ గోపాల్ వర్మ

తనదైన శైలిలో అభిప్రాయాలు వెల్లడిస్తూ నిత్యం వార్తల్లో ఉండే ప్రముఖ దర్శకుడు రామ్ గోపాల్ వర్మ, తాజాగా యువ హీరో అఖిల్ అక్కినేనిపై ప్రశంసల వర్షం కురిపించారు. అక్కినేని కుటుంబంలో అఖిలే అత్యుత్తమ నటుడని, ఈ మాటను నాగార్జునపై ఒట్టేసి చెబుతున్నానంటూ తనదైన శైలిలో వ్యాఖ్యలు చేశారు. అఖిల్ నటించిన తాజా చిత్రం 'లెనిన్' చూసిన తర్వాత వర్మ ఈ మేరకు ఎక్స్ వేదికగా స్పందించారు. "అఖిల్.. ఇప్పుడే 'లెనిన్' చూశాను. సినిమా అద్భుతంగా ఉండటమే కాకుండా, అక్కినేని కుటుంబంలో నువ్వే అత్యుత్తమ నటుడివి అని గ్రహించాను. నాగార్జునపై ఒట్టు!" అని ఆయన తన ట్వీట్‌లో పేర్కొన్నారు. భావోద్వేగాలు లేని సన్నివేశాల్లో కూడా అఖిల్ నటనలో చూపిన సహజత్వం (ఝంవ) అద్భుతంగా ఉందని వర్మ కొనియాడారు. ముఖ్యంగా ఎమోషనల్ సీన్స్‌లో అఖిల్ నటనతో అదరగొట్టేశాడని (ఖ×రాజుణ ఢ్) అన్నారు. అఖిల్‌కు ఇంత మంచి పాత్రను ఇచ్చిన దర్శకుడు మురళి కిశోర్ అబ్బూరిని కూడా ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ప్రస్తుతం ఆర్జీవీ చేసిన ఈ ట్వీట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సినీ వర్గాల్లో, అక్కినేని అభిమానుల్లో ఇది ఆసక్తికర చర్చకు దారితీసింది. ఈ నెల 10న విడుదలైన లెనిన్ చిత్రం అఖిల్ కెరీర్ లోనే భారీ విజయం దిశగా దూసుకుపోతోంది. ఇందులో



అఖిల్ సరసన భారతి పాత్రలో భాగ్యశ్రీ బోర్సే అందంగా ఒదిగిపోయింది. ఈ చిత్రానికి నాగార్జున, నాగవంశీ నిర్మాతలుగా వ్యవహరించారు.

# శివరాజ్ కుమార్‌కు 'గుమ్మడి నర్సయ్య' టీమ్ విషెస్..


## ఆసక్తి రేపుతున్న ట్వీట్



కన్నడ సినీ పరిశ్రమలో 'కరుణాడ చక్రవర్తి'గా ఖ్యాతి గడించిన ప్రముఖ నటుడు శివరాజ్‌కుమార్ జూలై 12న తన 64వ పుట్టినరోజును జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు సినీ ప్రముఖులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేయగా, ఒక ట్వీట్ మాత్రం అందరి దృష్టిని విశేషంగా ఆకర్షించింది. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న 'గుమ్మడి నర్సయ్య' బయోపిక్ చిత్ర బృందం ప్రత్యేకంగా విషెస్ తెలపడమే ఇందుకు కారణం. తెలంగాణకు చెందిన సీనియర్ రాజకీయ నాయకుడు, ఐదుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించిన గుమ్మడి నర్సయ్య జీవిత చరిత్ర ఆధారంగా ఈ చిత్రం రూపొందుతోంది. ఇందులో శివరాజ్‌కుమార్ టైటిల్ రోల్ పోషిస్తుండగా, ఆయన ఒక తెలుగు సినిమాలో పూర్తిస్థాయి హీరోగా నటిస్తుండటం ఇదే ప్రథమం. 'బీఏ రాజు సూపర్ హిట్' ఎక్స్ (ట్విట్టర్) ఖాతా వేదికగా "టీమ్ #GummadiNarasaiah»» పేరిట ఈ శుభాకాంక్షలను పోస్ట్ చేశారు.
పరమేశ్వర్ హివ్రాళే దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన ప్రచార బాధ్యతలను బీఏ రాజు టీమ్ పర్యవేక్షిస్తోంది. పుట్టినరోజు శుభాకాంక్షల ద్వారా సినిమాను ప్రమోట్ చేసే క్రమంలో భాగంగా, శివరాజ్‌కుమార్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ చిత్రంలోని ఆయన లుక్‌ను (పోస్టర్) చిత్ర బృందం విడుదల చేసింది.

# రష్మిక ఆసక్తికర పోస్ట్.. 'రణబాలి'పై అంచనాలు పెంచేసింది!

టాలీవుడ్ స్టార్ కపుల్ విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా నటిస్తున్న కొత్త చిత్రం 'రణబబాలి'. తాజాగా ఈ చిత్రం గురించి రష్మిక ఆసక్తికరమైన పోస్ట్ చేశారు. ఈ సినిమాలోని కొన్ని సన్నివేశాలు చూసిన ఆమె, తన ఉత్సాహాన్ని ఆపుకోలేక సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. రష్మిక చేసిన ఈ వ్యాఖ్యలతో సినిమాపై అంచనాలు అమాంతం పెరిగాయి. ఇందులో రణబాలిగా విజయ్, జయమ్మ పాత్రలో రష్మిక అలరించనున్నారు. ఎక్స్ వేదికగా రష్మిక స్పందిస్తూ.. "ఈ విషయం నేను మీతో పంచుకోవచ్చో లేదో తెలియదు. గతంలో చాలాసార్లు జరిగినట్లు దీన్ని డిలీట్ చేయమని అడగరని ఆశిస్తున్నా. కానీ, ఈ కుర్రాళ్లు చాలా బీభత్సం చేస్తున్నారు. ఆ సీన్లు అద్భుతం. నేను కంట్రోల్ చేసుకోలేకపోయా. దీన్ని పెద్ద తెరపై చూడటానికి అస్సలు ఆగలేకపోతున్నా" అని రాసుకొచ్చారు. ఈ పోస్ట్‌లో విజయ్ దేవరకొండతో పాటు దర్శకుడు రాహుల్ సంకృత్యాన్‌ను కూడా ఆమె ట్యాగ్ చేశారు. పీరియాడిక్ చిత్రంగా రూపుదిద్దుకుంటున్న రణబాలి చిత్రానికి రాహుల్ సాంకృత్యన్ దర్శకుడు. రియల్ లైఫ్ జోడీ విజయ్, రష్మిక ఈ సినిమాలోనూ జంటగా నటిస్తున్నారు. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన గీతగోవిందం, డియర్ కామ్రేడ్ చిత్రాలు బాక్సాఫీస్ వద్ద భారీ విజయం సాధించాయి.



# ధనుష్ సినిమాలో విజయ్ సేతుపతి?..

## ఒక్క సోషల్ మీడియా పోస్ట్‌తో పెరిగిన ఊహాగానాలు!



జాతీయ అవార్డు గ్రహీతలు, నటుడు ధనుష్, దర్శకుడు వెట్రిమారన్ కాంబినేషన్‌లో వస్తున్న సరికొత్త చిత్రం 'తమిళ్ మురుగన్'. ఇటీవలే విడుదలైన ఈ సినిమా ఫస్ట్ లుక్ ప్రేక్షకుల్లో భారీ అంచనాలను రేకెత్తించింది. అయితే, ప్రముఖ నటుడు విజయ్ సేతుపతి ఈ ఫస్ట్ లుక్‌ను తన సోషల్ మీడియా వేదికగా పంచుకోవడంతో కోలీవుడ్‌లో సరికొత్త చర్చ మొదలైంది. ఈ చిత్రంలో విజయ్ సేతుపతి కూడా ఒక కీలక పాత్ర పోషిస్తున్నారంటూ ఊహాగానాలు జోరందుకున్నాయి.
వండర్‌వాల్ ఫిలింస్, ప్రొడక్షన్ మైల్స్ టు గో సంస్థలు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. విజయ్ సేతుపతి ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను షేర్ చేయడంతో, ఆయన ఈ ప్రాజెక్టులో భాగమయ్యారని అభిమానులు అంచనా వేస్తున్నారు. గతంలో వెట్రిమారన్ దర్శకత్వంలో వచ్చిన 'విడుదలై', 'అరసన్' వంటి చిత్రాల్లో విజయ్ సేతుపతి నటించారు. ఈ నేపథ్యంలో తాజా ప్రచారానికి మరింత బలం చేకూరింది. ధనుష్, వెట్రిమారన్ కాంబినేషన్‌లో వచ్చిన చిత్రాలు విమర్శకుల ప్రశంసలతో పాటు బాక్సాఫీస్ వద్ద కూడా ఘనవిజయం సాధించాయి. ఇప్పుడు ఈ శక్తివంతమైన కలయికకు విజయ్ సేతుపతి కూడా తోడైతే, సినిమాపై అంచనాలు ఆకాశాన్ని అంటుతాయని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే, విజయ్ సేతుపతి నటిస్తున్నట్లు చిత్ర బృందం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. తదుపరి నటీనటుల వివరాలు, సినిమా విడుదల తేదీపై త్వరలోనే స్పష్టత రావాల్సి ఉంది.







